సాక్షి
వికారాబాద్

శనివారం ၊ 20 ၊ సెప్టెంబర్ ၊ 2025




భయం నీడన బాలిక!

తాండూరులో బాలికలపై వేధింపులు పెచ్చుమీరాయి. వీటిని తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. 10లో▸



తవ్వకాలకు అనుమతులా?

దళితుల భూముల్లో మట్టి తవ్వకాలకు ఎలా అనుమతులు ఇస్తారని కేవీపీఎస్ మండల అధ్యక్షుడు సురేశ్ మండిపడ్డారు. 10లో▸



ఓటుహక్కుపై అవగాహన..

యాలాలలోని పీఎంశ్రీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. 11లో▸

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పూడూరు: వికారాబాద్ పట్టణంలో మూడు రోజుల పాటు జరిగిన అండర్ – 14, –17 బాలికల విభాగం వాలీబాల్, ఖోఖో పోటీల్లో మండలంలోని అంగడిచిట్టంపల్లి పాఠశాల విద్యార్థినులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నరేందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థినులు జోనల్ స్థాయిలో ప్రతిభ చాటి మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విజేతకు బహుమతి అందజేస్తున్న సాహు శ్రీలత

తాండూరు టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత మాట్లాడుతూ.. మోదీ జన్మదినం సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ ముదిరాజ్, నాగారం మల్లేశం, భద్రేశ్వర్, కృష్ణ, కిరణ్, ప్రహ్లాద్, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, అనంతప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం



తాండూరు టౌన్: ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతగానో దోహదపడుతుందని జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ ఆర్ రాజు అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ మార్క్స్ జూబ్లీ పాఠశాల ఆవరణలో శిక్షితులైన తైక్వాండో క్రీడాకారులకు ఫిట్‌నెస్, టెక్నికల్ విభాగాల్లో పరీక్ష నిర్వహించారు. అనంతరం బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జోసెఫ్, డీన్ సతీషన్, తైక్వాండో కోచ్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు రుణాలు


- మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్



రుణం కోసం దరఖాస్తు చేసుకుంటున్న వీధి వ్యాపారి

అనంతగిరి: వీధి వ్యాపారులు లోక్ కళ్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ సూచించారు. శుక్రవారం వికారాబాద్‌లోని మెప్మా కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 2వ తేదీ వరకు లోక్ కళ్యాణ్ మేళా శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద వీధి వ్యాపారులకు మూడు దశల్లో రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో రూ.15 వేలు, రెండో దశలో రూ.25 వేలు, మూడో దశలో రూ.50 వేల వరకు రుణాలు ఇస్తారన్నారు. ఈ మొత్తాన్ని 12, 18, 36 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణాలు సక్రమంగా చెల్లించే వారికి రూ.30 వేల విలువ చేసే రూపే క్రెడిట్ కార్డులు అందేలా చూస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలు కొనసాగించాని ఇలా చేస్తే ఏడాదికి రూ.1,600 క్యాష్ బ్యాక్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కొత్తగా వ్యాపారం చేయాలనుకునే వారు రుణాల కోసం మెప్మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి కుమార్, వికారాబాద్ టీఎంసీ వెంకటేష్, కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనాథ్ రెడ్డి, మెప్మా సిబ్బంది, పలువురు వీధివిక్రయదారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ధమాకా!



పాలమూరు ఎత్తిపోతల పథకం

మహానేత వైఎస్సార్ పథకానికి మళ్లీ ప్రాణం

- ప్రాణహిత – చేవెళ్ల రీ డిజైన్‌తో మన ప్రాంతానికి నీటి కేటాయింపులు
- 'కేపీ లక్ష్మీదేవిపల్లి'కి లైన్ క్లియర్
- ఇప్పటికే పట్టాలెక్కిన 'కొడంగల్ – నారాయణపేట'
- జిల్లాను సస్యశ్యామలం చేసే దిశగా అడుగులు

వికారాబాద్: దివంగత సీఎం వైఎస్సార్ మానస పుత్రికగా పిలువబడే ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు మళ్లీ ప్రాణం పోసుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న ఈ ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ చేసి కాళేశ్వరంగా మార్చిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాకు నీటి కేటాయింపులు లేకుండా పోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ తెరపైకి వచ్చింది. అందులో జిల్లాను చేర్చడంతో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి జిల్లాకు నీరందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అధికారులతో కలిసి ప్రాజెక్టు నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. కొడంగల్ – నారాయణపేట్ ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించే ప్రక్రియ ఇప్పటికే ప్రా రంభమైంది. అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే జిల్లాకు మూడు ప్రాజెక్టుల ద్వారా సాగునీరందనుంది. ఈ మూడు ప్రాజెక్టుల చివరి భాగం జిల్లా కావడంతో ఏదో ఒకదాని నుంచి నీరందించేందుకు వీలవుతుందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. జిల్లాలో ఆరు లక్షల పైచిలుకు ఎకరాల సాగు భూ మి ఉండగా పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ద్వారా వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలతో పాటు చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని 2.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా 2.47 లక్షల ఎకరాలకు.. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా మన ప్రాంతానికి నీరందనుంది.

రీ డిజైన్ల పేరుతో..

ఇప్పటి వరకు జిల్లాకు చెందిన ప్రధాన ప్రాజెక్టులన్నింటికీ ఏదో ఒక కొర్రీ పెట్టి కొండెక్కిస్తూ వచ్చారు. పలుసార్లు సర్వేలు.. రీ డిజైన్లు... కేసులు అంటూ కాలయాపన చేశారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తి పోతల పథకాన్ని దశాబ్దాలుగా సర్వేలకే పరిమితం చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు 50 టీఎంసీల కేటాయింపులు ఉన్న ప్రాణహిత – చేవెళ్లను రీ డిజైన్ పేరుతో గత ప్రభుత్వం అటకెక్కించింది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతల పథకం సర్వే కోసం రూ.6.91 కోట్లు ఖర్చు చేసింది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 115 టీఎంసీల నీటి కేటాయింపులు జరగ్గా అందులో 45 టీఎంసీల సామర్థ్యంలో పరిగి నియోజకవర్గంలో రిజర్వాయర్లు కట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో గండేడ్, కుల్కచర్ల మండలంలో నిర్మించే రిజర్వాయర్ సామర్థ్యం 35 టీఎంసీలుగా ప్రస్తావించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టులో భాగంగా పరిగి మండలం రావులపల్లి శివారులో 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయించారు. తద్వారా జిల్లాలోని 2,46,154 ఎకరాలకు నీరందించాలని భావించారు. అయితే రాష్ట్రం విడిపోవడం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అనేక సార్లు డిజైన్లు మారుస్తూ వచ్చారు. చివరకు గ్రావిటీ ద్వారానే జిల్లాకు నీరందిస్తామని చెప్పారు. కానీ అది కూడా పూర్తి చేయ లేదు. ప్రధాన ప్రాజెక్టుల విషయంలో అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవటానికే పరిమితమయ్యారే తప్ప జిల్లాకు మేలు చేయలేదు. కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టునైనా పూర్తిచేసి జిల్లాలోని పొలాలను తడపాలని రైతులు కోరుతున్నారు.

రాజధానికి దగ్గరగా ఉన్నా..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న మన జిల్లా పరిస్థితి దీపం చుట్టూ చీకట్లే అన్న చందంగా తయారైంది. అభివృద్ధిలో అందనంత దూరంలో ఉండిపోయింది. దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యం.. నోరు మెదపని జిల్లా నేతల తీరు వెనుకబాటుకు కారణంగా చెప్పవచ్చు. చిన్న చిన్న చెరువులు మినహా ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా లేదు.. నదుల ద్వారా సెంటు భూమి కూడా తడవని పరిస్థితి.. పరిశ్రమలు లేని జిల్లా ఏదైనా ఉందంటే.. అది వికారాబాదే.. జిల్లా ఇంతటి దారుణ పరిస్థితిలో ఉందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం జిల్లాకు చెందిన వ్యక్తే సీఎంగా ఉండటం, మరో వ్యక్తి కీలకమైన స్పీకర్ పదవిలో ఉండటం.. మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలూ అధికార పార్టీకి చెందినవారే కావడంతో ఈ ప్రాంత అభివృద్ధికి బీజం పడింది. సాగునీటి ప్రాజెక్టులపై ఆశలు చిగురించాయి. పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి జిల్లాకు నీరందించే ప్రాజెక్టులపై పలుమార్లు అసెంబ్లీలో లేవనెత్తడం దానికి ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం జిల్లా రైతుల్లో సంతోషాన్ని నింపింది.

ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది



అసెంబ్లీ సాక్షిగా కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని చెప్పడం జిల్లాకు శుభ పరిణామం. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని ఉపముఖ్యమంత్రి నుంచి హామీ తీసుకున్నాం. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాకు గొప్ప అచీవ్‌మెంట్. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత వైఎస్సార్ తన విజ్ఞప్తి మేరకే ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలో జిల్లాను చేర్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని అటకెక్కించింది. ప్రస్తుతం దీనిపై సీఎం సానుకూలంగా ఉన్నారు. కచ్చితంగా అన్ని ప్రాజెక్టులను నిర్మించి తీరుతాం.

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

ప్రయోగాత్మకంగా విత్తన పంటలు



ధారూరులో సాగుచేసిన వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

- పరిశీలించిన శాస్త్రవేత్తలు
- దిగుబడి రాగానే రైతులకు అందుబాటులో ఉంచుతామని వెల్లడి

ధారూరు: వరి, జొన్న, కందిలో మేలైన విత్తన ఉత్పత్తే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. పవన్‌చంద్రారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో ప్రయోగాత్మకంగా విత్తన పంటలు సాగు చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయశాఖ జిల్లా అధికారి రాజరత్నం, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి, ఏడీఏ వెంకటేశం, ఏఓ సూర్యప్రకాశ్, ఏఈఓలు సంజూ రాథోడ్, సంతోష్, రైతు సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ధారూరులో చాకలి మహేశ్, చెంగోల్ పవన్‌కుమార్ సాగు చేసిన వరి, కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ముగ్గురు రైతులను ఎంపిక చేసి జొన్న, కంది, వరి విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వాటిని సాగు చేసిన పొలాలను పరిశీలించడానికి వచ్చినట్లు తెలిపారు. దిగుబడి వచ్చిన తర్వాత వాటిని విత్తనాల రూపంలో స్థానిక రైతులందరికీ పంపిణీ చేయనున్నట్లు వివరించారు. నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంటకోత తర్వాత విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.ఆ తర్వాత వరి పంటకు నానో యూరియా స్ప్రే చేయించారు. వారం రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయని అధికారులు తెలిపారు.

చెంచుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- సర్కారు నదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి
- గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

కుల్కచర్ల: చెంచుల సంక్షేమానికి ప్రభుత్వాలు అందిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలోని చెంచు కాలనీలో జిల్లా అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. చెంచుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి జహంగీర్, ఎంపీడీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీ తీశారు. కార్యక్రమంలో హౌసింగ్ శాఖ పీడీ సయ్యద్ మక్రం, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రవికుమార్, మిషన్ భగీరథ డీఈ సుబ్రహ్మణ్యం, ఏఈ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు

పరిగి: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పరిగి పట్టణంలోని నజీరాబాద్ తండా సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ మోహనకృష్ణ కథనం మేరకు.. పూడూరు మండలం కేరెల్లి గ్రామానికి చెందిన ఖాజాపాషా భార్య రేహన, ఇద్దరు పిల్లలతో కలిసి కారులో పరిగికి వస్తున్నారు. నస్కల్ గ్రామానికి చెందిన తాజుద్దీన్ పరిగి నుంచి మన్నేగూడ వైపు కారులో వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఖాజాపాషా కుటుంబానికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వికారాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పని ఒత్తిడి తగ్గించండి



డీఎంహెచ్ఓ లలితాదేవికి వినతిపత్రం అందజేస్తున్న వైద్య ఉద్యోగులు

అనంతగిరి: జిల్లాలో ఆయా హోదాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గించాలని తెలంగాణ మెడికల్ అండ్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ చంద్రప్రకాష్ కోరారు. శుక్రవారం ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, డీఎంహెచ్ఓ లలితాదేవికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్‌ను రద్దు చేయాలన్నారు. క్షేత్రస్థాయి సేవలో నిమగ్నమవుతుండటంతో ఆరోగ్య కేంద్రాలకు వచ్చి హాజరు నమోదు చేసుకోవాలంటే చాల ఇబ్బంది కలుగుతుందన్నారు. ఆన్‌లైన్ యాప్‌లు, ఆన్‌లైన్ ఎంట్రీలు లేకుండా చేయాలన్నారు. తప్పనిసరైతే ప్రతి పీహెచ్‌సీకి ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించి ఆన్‌లైన్ పనులు చేయించాలన్నారు. పని ఒత్తిడితో అనారోగ్యాల బారిన పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్, రేణుకుమార్, వెంకన్న, తిరుపతయ్య, రవీందర్‌రెడ్డి, ప్రకాష్, ఫకీరప్ప, అమరేశ్వరి, విజయలక్ష్మి, అనిత, విమల, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రోస్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



నానో యూరియా టిన్‌లతో ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి: ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆగ్రోస్ కేంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ కేంద్రాల్లో రైతులకు అందుబాటు ధరల్లో అన్ని రకాల మందులు, ఎరువులు ఉంటాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మందులు, ఎరువులు విక్రయించాలని సూచించారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ వాడాలన్నారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభు త్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, నాయకులు రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత అలైన్‌మెంట్ అమలు చేయాలి

- ట్రిపుల్‌ఆర్ భూ బాధిత రైతులు
- స్పీకర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి వినతి పత్రాలు అందజేత

నవాబుపేట: ట్రిపుల్‌ఆర్ పాత అలైన్‌మెంట్‌ను అమలు చేయాలని మండల రైతులు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి స్పీకర్ ప్రసాద్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. శుక్రవారం ఈ మేరకు నగరంలో వారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అలైన్‌మెంట్ మారడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పాత అలైన్‌మెంట్ పరిధిలో ప్రభుత్వ భూములు అధికంగా ఉన్నాయని, కొత్త అలైన్‌మెంట్ వల్ల తమ పట్టా భూములు కోల్పోవాల్సి వస్తోందని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేయాలని, లేకుంటే వీధిన పడతామని స్పీకర్‌కు విన్నవించారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

స్వచ్ఛందంగా భూములివ్వాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- లగచర్ల గ్రామంలో భూ సమస్యలపై విచారణ



లగచర్ల రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

దుద్యాల్: భూ సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రైతులకు సూచించారు. శుక్రవారం దుద్యాల్ మండలం లగచర్ల గ్రామంలో రెవెన్యూ సదస్సుల్లో భాగంగా అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో భూ సమస్యలు ఉంటాయని వాటిని సులువుగా పరిష్కరించుకునే మార్గం ఎంచుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 37 దరఖాస్తులు అందాయని, 24 సమస్యలను ఇది వరకే పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలిన 13 కోసం సమావేశం ఏర్పాటు చేశామని తహసీల్దార్ కిషన్ తెలిపారు.కార్యక్రమంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఎంపీడీవో మహేశ్ కుమార్, డీటీ శివ కుమార్, ఆర్ఐ నవీన్ కుమార్, ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మోహన్, రెవెన్యూ సిబ్బంది లాలప్ప, పక్కీరప్ప పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి

పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం లగచర్ల, రోటి బండ తండా, పులిచర్లకుంట తండాలో కొంత మంది రైతులు భూములు ఇవ్వలేదని, స్వచ్ఛందంగా ముందుకు ఇస్తే వారికి వెంటనే పరిహారం అందేలా చూస్తామని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ తెలిపారు. భూములు ఇవ్వమని మొండికేస్తే వారి వివరాలు కోర్టుకు తెలియజేసి పరిహారం కోర్టులో డిపాజిట్ చేస్తామని పేర్కొన్నారు. ఈ వ్యవహారం కోర్టు పరిధిలోకి వెళ్తే తక్కువ పరిహారం వస్తుందన్నారు. లగచర్ల ఘటన నేపథ్యంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాదాపు 100 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

హకీంపేట్‌లో స్థల పరిశీలన

హకీంపేట్ గ్రామంలో ఇందిర మహిళా శక్తి పథకం కింద మంజూరైన పెట్రోల్ పంప్ కోసం కేటాయించిన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన సమీకృత పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

24లోపు నివేదికలు సమర్పిస్తాం

అనంతగిరి: కేటగిరీల వారీగా ఓటర్ల వివరాలను ఈ నెల 24వ తేదీలోపు సమర్పిస్తామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శుక్రవారం నగరం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఓటరు జాబితా కేటగిరీలపై చేపట్టాల్సిన విధివిధానాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన ఎన్నికల ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మంగీలాల్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నైమత్ అలీ, తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మండలానికి జీపీవోల కేటాయింపు



తహసీల్దార్‌కు రిపోర్ట్ చేస్తున్న జీపీవోలు

దుద్యాల్: గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ అధికారులను నియమించింది. అందుకు గాను మొదటి విడుత ఎంపికలో భాగంగా గతంలో పని చేసిన వీఆర్వోలు, వీర్ఏలను ఎంపిక చేసింది. దుద్యాల మండలానికి ఆరుగురిని కేటాయించినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. పి గోపాల్, కావలి శ్రీనివాస్, ఆర్ రమేశ్ శుక్రవారం తహసీల్దార్‌కు రిపోర్ట్ చేశారు. మిగత ముగ్గురు కూడా త్వరలో రిపోర్ట్ చేస్తారని తెలిసింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కిషన్ మాట్లాడుతూ..గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు.

రేడియల్ రోడ్డు వద్దంటూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పరిగి: రైతుల పొలాల నుంచి చేపట్టనున్న రేడియల్ రోడ్డు వద్దని రైతులు, గ్రామస్తులు శుక్రవారం రంగాపూర్‌లో నిరసన చేపట్టారు. దామగుండం నేవీరాడర్ స్టేషన్‌కు వెళ్లేందుకు శంషాబాద్ నుంచి రంగాపూర్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి ఇటీవల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పాత రోడ్డు నుంచే రోడ్డు వేయాలని వారు అధికారులను కోరారు. సర్వే చేసిన విధంగానే వేయనున్నట్లు చెప్పడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో మంది భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తున్నామన్నారు. రేడియల్ రోడ్డు నిర్మాణంతో తమ ఉపాధి హరించకపోతోందని చిన్నకారు, సన్నకారు రైతులు వివరిస్తున్నారు. ఈ విషయం గురించి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి మ్యాప్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న కాలంలో ధర్నాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్లు

శంకర్‌పల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు జోనల్ సెక్రెటరీ ప్రభాకర్ అన్నారు. మండలం పరిధిలోని జన్వాడలో ఏర్పాటు చేసిన ఈ ఎంపికలకు జోన్ (చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలు) నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో అండర్–14లో 18 మంది, అండర్–17 విభాగంలో 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. జోనల్ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు త్వరలో హైదరాబాద్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

అత్యాచార నిందితుడి అరెస్ట్

ఇబ్రహీంపట్నం: వృద్ధ యాచకురాలిని గాయపరిచి, అత్యాచారానికి ఒడిగట్టిన కామాంధుడిని ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం కటకటాల వెనక్కు నెట్టారు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఇబ్రహీంపట్నం కొత్త బస్టాండ్ వెనుక ఉన్న షాపు వరండాలో బుధవారం అర్ధరాత్రి ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధ యాచకురాలిపై లైంగికదాడికి పాల్పడిన విషయం విదితమే. ఈ అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన పల్లాటి రవీందర్(38)గా గుర్తించి ఆయన్ను చర్లపల్లి జైల్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే ఇతనిపై గతంలోనూ పలు కేసులున్నాయన్నారు. ఈ ఘటన విషయం తెలియగానే నాలుగు ప్రత్యేక బృందాలు సీసీ ఫుటేజీలు పరిశీలించి, నిందితుడిని పట్టుకున్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

ట్రాక్టర్ బోల్తా

ఆమనగల్లు: ట్రాక్టర్ బోల్తాపడడంతో ఒకరు మృతిచెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన తలకొండపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన జంగయ్య (50) రెండు నెలలుగా మిడ్జిల్‌లో సిమెంట్ ఇటుకల తయారీ పనులకు వెళ్తున్నాడు. శుక్రవారం మరో నలుగురు కూలీలతో కలిసి సిమెంట్ ఇటుకలను ట్రాక్టర్‌లో నింపుకొని తలకొండపల్లి మండలం మాదాయిపల్లికి వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. జంగయ్యపై ఇటుకలు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నలుగురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భయం నీడన బాలిక!

- తాండూరులోని సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో చదువుతున్న ఓ బాలికతో వైస్ ప్రిన్సిపల్ బాలస్వామి అనుచితంగా ప్రవర్తిస్తున్నాడు. అతని అకృత్యాలను భరించలేని విద్యార్థిని ఈనెల 10న తల్లిదండ్రులకు విషయం చెప్పింది. దీంతో మరుసటి రోజు పాఠశాలకు వెళ్లిన బాలిక కుటుంబ సభ్యులు అతడిని చితకబాదారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరువుపోతుందనే కారణంతో అక్కడితోనే ఆగిపోయారు.
- కూతుళ్లను బాగా చదివించాలనే ఉద్దేశంతో ఓ కుటుంబం పట్టణంలోని సాయిపూర్‌లో ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటోంది. పదో తరగతి చదువుతున్న బాలిక ఉన్నట్టుండి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మరణానికి లైంగిక వేధింపులే కారణమని తెలియడంతో శవాన్ని తీసుకెళ్లి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. బిడ్డను పోగొట్టుకున్న పుట్టెడు దుఃఖంలో.. పరువును కూడా పోగొట్టుకోలేక పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కలేదు.

మైనర్లకు రక్షణ కరువు

- ఏటా పెరుగుతున్న అదృశ్యాలు, అఘాయిత్యాలు
- పరువు పోతుందని ఫిర్యాదుకు వెనకాడుతున్న బాధిత తల్లిదండ్రులు

బాలికలపై నమోదైన కేసులు

పోలీస్ స్టేషన్	2024లో		2025లో	
	మిస్సింగ్	పోక్సో	మిస్సింగ్	పోక్సో
తాండూరు	02	13	03	15
కరన్‌కోట్	08	03	03	06
పెద్దేముల్	03	05	04	10
బషీరాబాద్	03	01	0	02
యాలాల	04	05	07	05
మొత్తం	20	27	17	38



తాండూరు: పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో బాలికలపై వేధింపులు పెచ్చుమీరాయి. వీటిని తట్టుకోలేక అభంశుభం తెలియని విద్యార్థినులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఏటా పదుల సంఖ్యలో బాలికలు అదృశ్యమవుతున్నా వీటిని కట్టడం చేయడంలో పోలీస్ శాఖ విఫలమవుతోందనే విమర్శలున్నాయి. 14 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు వయసున్న బాలికల భద్రత తల్లిదండ్రులకు సవాలుగా మారింది. స్కూల్‌కు వెళ్తున్న మైనర్లపై దాడులు జరుగుతున్నాయి. మరోవైపు తెలిసీతెలియని వయసులో ఉన్న బాలికలను కొంతమంది ఆకతాయిలు ప్రేమ పేరుతో వంచిస్తున్నారు. తాండూరు పరిధిలో 2024 జనవరి నుంచి 2025 ఆగస్టు వరకు గడిచిన ఇరవై నెలల కాలంలో 37 మంది బాలికలు అదృశ్యమయ్యారు. మరోవైపు మైనర్లపై లైంగిక దాడులకు పాల్పడిన వారిపై 65 పోక్సో కేసులు నమోదయ్యాయి. పోలీసుల అధికారిక లెక్కలు ఇలా ఉండగా.. ఫిర్యాదు చేయని ఘటనలు ఇంతకు మించి ఉంటాయనేది బహిరంగ రహస్యం.

సుమోటోగా తీసుకోవాలి

మేజర్ కాదనే కారణంతో పద్దెనిమిదేళ్లకు రెండు నెలలు తక్కువ వయస్సున్న బాలికల వివాహాలను పీటల మీదే ఆపేస్తున్న పోలీసులు, బంధువులతో పాటు పెళ్లి తంతు నిర్వహించే పురోహితుడిపైనా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు. కానీ లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడుతున్న కీచకులపై ఫిర్యాదు చేస్తేనే కేసులు నమోదు చేస్తామనడం దారుణం. ఇలాంటి దుర్మార్గాలను సుమోటోగా తీసుకుంటే బాగుంటుంది.
– మంజుల, తాండూరు

చర్యలు తీసుకుంటున్నాం



రెండేళ్ల వ్యవధిలో 37 మంది మైనర్ బాలికలు మిస్సింగ్ అయ్యారు. వీటిలో సగానికి పైగా ఛేదించాం. మైనర్లపై లైంగిక దాడులకు పాల్పడితే ఫిర్యాదు చేయండి. వివరాలను గోప్యంగా ఉంచుతాం. విద్యార్థినుల రక్షణ కోసం పాఠశాలలు, కళాశాలల వద్ద షీ టీమ్ నిఘా పెడుతోంది.
– బాలకృష్ణారెడ్డి, డీఎస్పీ, తాండూరు

రక్షణ చట్టాన్ని అమలు చేయాలి



కొడంగల్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- న్యాయవాదుల విధుల బహిష్కరణ

కొడంగల్ రూరల్: న్యాయవాదులపై దాడులకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని కొడంగల్ బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంసీసీబీఏ, నాంపల్లి కోర్టు జీవిత కాల సభ్యులు, సీఓపీ న్యాయవాదులు అనిల్‌కుమార్‌బోగా, హనుమాన్‌నాయక్‌పై దాడికి పాల్పడటం దారుణమన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు కోసం నిరిహార దీక్ష చేస్తున్న సంగారెడ్డి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటయ్య, ఉపాధ్యక్షుడు బస్వరాజు, న్యాయవాదులు ఏవీ.ఆనంద్, టి.కరుణాకర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, కె.రాములు, బి.కృష్ణయ్య, కె.రమేశ్, భానుప్రసాద్, రవీందర్‌నాయక్, మోహిద్, జి.శివరెడ్డి, చంద్రమోహన్, భీమయ్య పాల్గొన్నారు.

నకిలీ అల్లంవెల్లుల్లి పట్టివేత

- పేస్ట్‌తో పాటు రసాయనాలు, రంగుల స్వాధీనం
- ఇద్దరికి రిమాండ్



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న అల్లం వెల్లుల్లి పేస్ట్

తాండూరు టౌన్: నకిలీ అల్లంవెల్లుల్లి తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం వారిని రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలోని మణికంఠ కిరాణా దుకాణంలో గురువారం టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్ పాషా తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. 30 కిలోల నకిలీ అల్లంవెల్లుల్లి పేస్టుతో పాటు, పేస్టు నింపి ఉన్న 111 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దుకాణ యజమాని వీరన్నను అదుపులోకి తీసుకుని విచారించారు. తాను హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్ సలీం అనే వ్యక్తి వద్ద నకిలీ అల్లంతో పాటు తయారీకి వినియోగించే రసాయనాలు, కృత్రిమ రంగులను కొనుగోలు చేసినట్లు చెప్పాడు. దీంతో ఇమ్రాన్ దుకాణంపై దాడి చేసి 166 కిలోల నకిలీ అల్లంవెల్లుల్లి పేస్టుతో పాటు పేస్టు నింపిన 38 బాటిళ్లు, 30 కిలోల కల్తీఅల్లం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

దాడికి పాల్పడిన వ్యక్తికి రిమాండ్



అడివప్పను రిమాండ్‌కు తరలిస్తున్న కరన్‌కోట్ పోలీసులు

తాండూరు రూరల్: సిగరెట్ ఇవ్వలేదనే కోపంతో దుకాణా యజమానిపై దాడికి పాల్పడిన వ్యక్తిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్ కథనం ప్రకారం.. చిట్టిఘనాపూర్ గ్రామానికి చెందిన ఈడ్గి అంజయ్యగౌడ్ అదాని సిమెంట్ ఫ్యాక్టరీ గేటు ఎదుట కిరాణషాపు నిర్వహిస్తున్నాడు. ఈనెల 10న బెల్కటూర్‌కు చెందిన అడివప్ప మద్యం తాగి, అంజయ్యగౌడ్ షాపు వద్దకు వెళ్లి సిగరెట్ ఇవ్వాలని కోరాడు. రాత్రి కావడంతో షాపు బంద్ చేస్తున్నానని, సిగరెట్ కూడా లేదని యజమాని చెప్పడంతో ఆగ్రహానికి గురైన అడివప్ప అతనిపై కర్రతో దాడి చేశాడు. బాధిత కుటుంబ సభ్యులు వెంటనే అంజయ్యగౌడ్‌ను చికిత్స నిమిత్తం తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడిలో అతని కుడిచేయి విరిగిపోయిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో అడివప్పపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన కరన్‌కోట్ పోలీసులు శుక్రవారం అతన్ని కొడంగల్ న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

నిత్యం వేధిస్తున్నాడని భర్తను చంపేసింది



కృష్ణంజ్యోతి బోరా మృతదేహం

మణికొండ: తనను తరచూ వేధిస్తున్నాడనే కోపంతో భర్తను కూరగాయలు కోసే కత్తితో పొడిచి చంపేసింది ఓ భార్య. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి కోకాపేటలో జరిగింది. నార్సింగి ఇన్‌చార్జి సీఐ రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రానికి చెందిన కృష్ణంజ్యోతి బోరా (30), బర్కి బోరా భార్యాభర్తలు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కోకాపేటలోని ఓ నిర్మాణ సంస్థలో పని చేస్తున్నారు. వారం రోజుల క్రితం భార్యను కొట్టి ఆమెతో గొడవ పడి ఇంట్లోంచి కృష్ణంజ్యోతి వెళ్లిపోయాడు. గురువారం అర్ధరాత్రి మద్యం మత్తులో వచ్చి తలుపులు కొట్టినా ఆమె తీయలేదు. తలుపులను కృష్ణంజ్యోతి బలంగా తన్నటంతో ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. బర్కి బోరాను కర్రతో కొట్టేందుకు యత్నించగా.. ఆమె పక్కనే ఉన్న కూరగాయలు కోసే కత్తితో అతనిపై దాడి చేసింది. తల, మెడ, కుడి భుజంపై కత్తితో పొడవటంతో కృష్ణంజ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి అరుపులు వినిపించడటంతో లేబర్ క్యాంపులో ఉన్న చుట్టు పక్కల వారు వచ్చి చూసే సరికి అతను రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు నిందితురాలు బర్కి బోరాని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని దంపతులకు గాయాలు

దోమ: ఎదురుగా వస్తున్న బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఊటుపల్లి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లికి చెందిన బాలయ్య, చిట్టెమ్మ దంపతులు పరిగి నుంచి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ఊటుపల్లి వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో బాలయ్య కాలు విరగగా, చిట్టెమ్మ స్వల్ప గాయాలతో బయట పడింది. గమనించిన స్థానికులు వెంటనే వారిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

24న అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ అడ్మిషన్స్ కౌన్సెలింగ్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025–26 విద్యా సంవత్సరానికి ఎంబీఏ (హాస్పిటల్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) కోర్సుల్లో చేరడానికి సెప్టెంబర్ 24న వర్సిటీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకునేవారు 2025–26 తెలంగాణ ఐసెట్ లేదా అంబేద్కర్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎంబీఏ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించాలన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను చూడవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పాఠశాలకు నిధులు మంజూరు చేయండి

యాచారం: కలెక్టర్ నారాయణరెడ్డికి రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి ఫోన్ చేశారు. యాచారం ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు శుక్రవారం ఉదయం కోదండరెడ్డిని కలిశారు. పాఠశాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరయ్యేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. దీంతో వెంటనే ఆయన కలెక్టర్‌కు ఫోన్ చేసి పాఠశాల ప్రహరీ నిర్మాణం, విద్యార్థుల తాగునీటి పరిష్కారం కోసం బోరుబావి తవ్వించి మోటార్ బిగించడానికి కావాల్సిన నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని సూచించారు. స్పందించిన కలెక్టర్ నిధులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

మాడ్గుల: మండల పరిధిలోని కలకొండ శివారు వాగు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. సీఐ వేణుగోపాల్‌రావు తెలిపిన ప్రకారం.. శుక్రవారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ టిప్పర్‌లో మట్టి తరలిస్తున్నారు. గమనించిన పోలీసులు వాహనాన్ని నిలిపి తనిఖీలు చేపట్టగా ఎటువంటి అనుమతి పత్రాలు లేవని చెప్పారు. దీంతో వాహన డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసి టిప్పర్ సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో శనివారం స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు తెలిపారు. దోస్త్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయి ఖాళీగా ఉన్న మిగతా సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ మార్కులు మెమోలు, టీసీ, బొనఫైడ్, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు జిరాక్స్ ప్రతులు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు ఫోన్: 70327 13785లో సంప్రదించాలన్నారు.

ఇప్పట్లో 'దారి'కొచ్చేనా..!

చిత్రంలో కనిపిస్తున్నది వరదనీటి కాలువ అనుకుంటే మీరు గుంతలో కాలేసినట్లే. ఇది అక్షరాలా ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డు. బషీరాబాద్‌లోని పశువుల దవాఖానా నుంచి అంబేడ్కర్ ప్రధాన కూడలి మీదుగా పాత బీఎస్ఎన్ఎల్ భవనం వరకు రహదారి దుస్థితి ఇలా తయారైంది. విస్తరణ పనుల్లో భాగంగా పది రోజుల క్రితం రోడ్డును తవ్విన కాంట్రాక్టర్ అలాగే వదిలేయడంతో భారీ వర్షాలకు నీళ్లు నిండి ఏటి కాలువను తలపిస్తోంది. మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు ఇలా మారడంతో ప్రయాణికులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. – బషీరాబాద్



నీటి కాలువను తలపిస్తున్న రహదారి

మట్టి తవ్వకాలకు అనుమతులా?

- కేవీపీఎస్ మండల అధ్యక్షుడు సురేశ్ మండిపాటు
- రైతుల నుంచి తీసుకున్న భూములకు పరిహారం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సురేశ్

బషీరాబాద్: దళితులకు ఇచ్చిన భూముల్లో మట్టి తవ్వకాలకు ఎలా అనుమతులు ఇస్తారని అధికారులపై కేవీపీఎస్ మండల అధ్యక్షుడు సురేశ్ మండిపడ్డారు. ఐదు దశాబ్దాల కిందటా అప్పటి దివంగత ఇందిరమ్మ ప్రభుత్వంలో దళితులకు సీలింగ్ పట్టాలు ఇస్తే, వాటిని సదరు వ్యక్తులకు తెలియకుండానే అధికారులు లాక్కున్నారని సురేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నావంద్గీ గ్రామానికి చెందిన 60దళిత కుటుంబాలకు సర్వేనంబర్ 182, 183లో 60 ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చారు. ఈ విషయం గురించి రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు తిరిగి లాక్కున్నారన్నారు. నాటి ఇందిరమ్మ కాలంలో భూములు పంపిణీ చేస్తే నేటి రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో దళితుల భూములు గుంజుకున్నారని విమర్శించారు. ఆ భూముల్లో ప్రైవేట్ వ్యక్తులకు మట్టి తవ్వకాల కోసం రెవెన్యూ అధికారులు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పేరుతో రైతుల నుంచి తీసుకున్న భూములకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండా లాక్కోవడం అన్యాయమన్నారు. వెంటనే సదరు భూముల్లో మట్టి తవ్వకాలు నిలిపివేసి, రైతులకు పరిహారం ఇప్పించాలని తహసీల్దార్ షాహెదాబేగానికి వినతిపత్రం అందజేశారు.

టీఎల్ఎం మేళాతో బోధన సులభతరం





దోమ: ఉపాధ్యాయులు పాండురంగాచారి, యాదగిరికి ప్రశంస పత్రాలు అందజేస్తున్న డీఈఓ



తాండూరు రూరల్: నమూనాతో శ్వేతారాణి



వికారాబాద్‌లో టీఎల్ఎం మేళా

అడిషనల్ కలెక్టర్ సుధీర్

అనంతగిరి: టీఎల్ఎం మేళాతో విద్యార్థులకు సులభతరంగా బోధన చేయడానికి అవకాశం ఉంటుందని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన 200లకు పైగా ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. తొమ్మిది ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, మండల విద్యాధికారి బాబుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఉపాధ్యాయులు

దోమ: టీఎల్ఎం రాష్ట్రస్థాయి మేళాకు మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. మోత్కూర్ పాఠశాలకు చెందిన పాండురంగాచారి(తెగులు), దాదాపూర్ పాఠశాలకు చెందిన యాదగిరి(ఈవీఎస్, పరిసరాల విజ్ఞానం) విద్యార్థులకు అందిస్తున్న టీఎల్ఎం మేళాలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కార్యాలయంలో జిల్లా విద్యాధికారి రేణుకాదేవి వానికి ప్రశంస పత్రాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు తమ తమ వృత్తిని బాధ్యతతో నిర్వహిస్తే ఎన్నో ప్రశంస పత్రాలను అందుకుంటారని తెలిపారు.

జిల్లాస్థాయిలో శ్వేతారాణి ప్రతిభ

తాండూరు రూరల్: జిల్లాస్థాయిలో నిర్వహించిన టీఎల్ఎం మేళాలో తాండూరు మండలం కొత్లాపూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు శ్వేతారాణి ప్రతిభ చాటారు. ఇంగ్లిష్ పాఠ్యాంశాలను నూతన పద్ధతుల్లో బోధన చేయడంపై టీఎల్ఎం మేళాలో నమూనాలు ప్రదర్శించారు. దీంతో శ్వేతరాణికి జిల్లాస్థాయిలో రెండో బహుమతి లభించింది. డీఈఓ రేణుకాదేవి చేతుల మీదగా సర్టిఫికెట్ అందుకున్నారు. తమ పాఠశాల ఉపాధ్యాయురాలు టీఎల్ఎం మేళాలో రెండో బహుమతి సాధించడంపై పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు, పాఠశాల హెచ్ఎం వినోద్‌కుమార్ అభినందించారు. ఉపాధ్యాయురాలి కృషిని సృజనాత్మకతతో పిల్లలకు సులభతరంగా బోధన చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

మాది చేతల ప్రభుత్వం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

షాబాద్: మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వారు మండల పరిధిలోని చందనవెళ్లిలో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వస్తాయన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ముందుకు సాగుతోందన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత తమదే అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌గౌడ్, రవీందర్‌నాయక్, పార్టీ నాయకులు స్వామి, రాహుల్‌గుప్తా, వేమారెడ్డి, బేగరి యాదయ్య, ప్రభాకర్‌రెడ్డి, కిషోర్‌నాయక్, మాధవరెడ్డి, శేఖర్, గౌరీ, రాఘవేందర్, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కబ్జాదారుల చెర నుంచి ప్లాట్లను కాపాడాలి

తుర్కయంజాల్: కబ్జాదారుల చెర నుంచి తమ ప్లాట్లను కాపాడాలని యజమానులు వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటన శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మన్నెగూడలో చోటు చేసుకుంది. తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నెంబర్ 510, 511, 512లోని భూమిని 20 ఏళ్ల క్రితం వెంచర్ చేయడంతో తాము ప్లాట్లను కొనుగోలు చేశామని, అయితే కొందరు వ్యక్తులు కొద్ది రోజులుగా ఈ భూమిలో నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రికార్డుల్లోని లొసగులను ఆసరాగా చేసుకుని ప్లాట్లు అయిన భూమికి పాసు పుస్తకాలను పొందారని ఆరోపించారు.